భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 18.0

రేపు ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం, జనవరి 18 : ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభ మవుతుందని ఉద్యోగులు ఎవరైనా తమ సమస్యలు చెప్పు కోవచ్చునని కలెక్టర్ తెలిపారు. గ్రీవెన్స్‌కు వెళ్లే ఉద్యోగు లకు అధికారులు అను మతులు ఇవ్వాలన్నారు.



అంగన్‌వాడీలు తమ పట్టు వీడలేదు. తమ డిమాండ్ల సాధనకు నిరసన కొనసాగిస్తున్నారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో వినూత్నంగా ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భీమవరం, తణుకు, వీరవాసరం, పాలకోడేరు తదితర ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. భీమవరంలో అంగన్వాడీలు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. అంగన్‌వాడీల ఆందోళనలకు వామపక్ష నాయకులు మద్దతు తెలిపారు.



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు , కార్యకర్తలు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల పేదలకు దుస్తులు పంచారు. రక్తదానాలు చేశారు. భీమవరంలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు అందజేశారు..

రిజర్వ్‌డుపై పగ





నా ఎస్సీ, నాఎస్టీ అంటూనే జగన్ మాయ
రెండు స్థానాల్లో సిట్టింగ్‌లకు మొండిచేయి
మరో రెండు స్థానాల్లో కుండమార్పిడి
గోపాలపురానికి హోం మంత్రి వనిత ట్రాన్స్‌ఫర్
కొవ్వూరుకు సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి బదిలీ
జనరల్ స్థానాలపై మాత్రం కనికరమే
వైసీపీ అధినాయకత్వం వింత పోకడ.. కేడర్ గగ్గోలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గాలపైనే వైసీపీ అధిష్ఠానం ఎందుకో పగ పట్టినట్టుంది. ఈ నాలుగు నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులకు పెట్టినంత శ్రద్ధ జనరల్ నియోజకవర్గాలపై కన్నెత్తి చూడటానికి కూడా ఆ పార్టీ భయపడినట్లు కనిపించింది. ఐ ప్యాక్ సర్వే ద్వారా మైనస్ పాయింట్‌లు వచ్చాయంటూ సిట్టింగ్‌లపై మార్పు ప్రయోగం చేసింది. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూనే వైసీపీ అధినాయకత్వంపైకి చెప్పేది ఒకటి లోపల చేసేది ఇంకోటి అన్నట్లు ఆది నుంచి రాజకీయాలు నెరపుతుంది. ఉమ్మడి పశ్చిమలో దీనికి తగ్గట్టుగానే తొలుత రిజర్వుడు నియోజకవర్గంపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది. చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను పక్కన పెట్టి, ఆయన స్థానంలో కె.విజయరాజును సమన్వయకర్తగా, పరోక్షంగా వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా నియమించింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఐప్యాక్ సర్వేల పేరిట పక్కనపెట్టారు. కనీసం తన భార్య రాజ్య లక్ష్మికి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బాలరాజు పదేపదే విన్నవించడం, అక్కడ తగిన అభ్యర్థి లేకపోవడంతో చివరకు అంగీకారం తెలిపి ఆమెను బరిలో నిలపబోతున్నారు.

ఇపుడు కుండ మార్పిడి

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలైన గోపాలపురం, కొవ్వూరు ఈసారి వైసీపీ కుండ మార్పిడి పద్ధతి అవలంబించింది. కొవ్వూరులో హోం మంత్రికి ఎదురుగాలి వీస్తుండటంతో ఆమెను తప్పించడమా.. గోపాలపురానికి బదిలీ చేయడమా ? అనే విషయంలో చానాళ్లు తర్జనభర్జన పడ్డారు. దళిత మహిళ హోం మంత్రిగా ఉండటం, తప్పనిసరి పరిస్థితుల్లో సీటు ఖాళీ చేసేకన్నా ప్రత్యామ్నాయంగా గోపాలపురానికి బదిలీ చేయడమే మేలని భావించారు. తగ్గట్టుగానే గోపాలపురం సిట్టింగ్ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఉన్న స్థానం నుంచి మార్చేది లేదని చెబుతూనే తుదకు కొవ్వూరు పంపేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగుల మార్పులు, చేర్పులకు సంబంధించి గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత నిర్ణయం తీసుకున్నారు. ఒక రకంగా అందరూ ఊహించినట్లుగానే ఈ మార్పిడి జరిగింది. మంత్రి వనితకు గోపాలపురంతో ఆది నుంచి సంబంధాలు ఉన్నాయి. తొలుత టీడీపీలో ఈ నియోజకవర్గం నుంచే తన తండ్రి వారసురాలిగా ఎన్నికయ్యారు. వర్గపోరు శ్రుతిమించడం, కొందరు పెద్దలు అంటీ ముట్టనట్లు వ్యవహరించడం, ముంచుకొచ్చిన ముప్పేట వ్యతిరేకత ఇపుడు వనితకు సీటు మార్చేలా చేశాయి.

ప్రీఫైనల్‌కు ప్రభుత్వ అడ్డంకి!



ఏలూరులో నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప యాత్రలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ తదితరులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రైవేటు కళాశాలల బస్సుల సేకరణ
దూరప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావం
నేటి నుంచి 25 వరకు ప్రీ-ఫైనల్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్ /ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 18 : కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు సన్నద్ధతగా పరిగణించే ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్న శుక్రవారం తొలిరోజే పలువురు విద్యార్థులు ఈ పరీక్షలకు దూరమయ్యే పరిస్థితులు స్పష్టంగా కనబడుతున్నాయి. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమా నికి జిల్లావ్యాప్తంగా ప్రజలను తరలించేందుకు ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి పెద్దసంఖ్యలో బస్సులను ప్రభుత్వ మౌఖిక ఆదేశాల మేరకు రవాణాశాఖ సేకరిస్తుండడమే దీనికి కారణమన్న విమర్శలు వస్తు న్నాయి. ప్రభుత్వ కార్యక్రమానికి విద్యాసంస్థల బస్సులను బలవంతంగా తీసుకోవడం వల్ల పిల్లల పరీక్షలపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీ డియట్ ప్రీ-ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి ఈనెల 25 వరకు జరుగు తాయి. ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో నిర్ణీత టైం టేబుల్ ప్రకారం నిర్వహించాల్సిందేనని ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ఏలూరు జిల్లాలో ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు మొత్తం 87 ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టుల విద్యార్థులు 27,944 మంది, ఒకేషనల్ సబ్జెక్టుల విద్యార్థులు 4501 మంది ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 70 కళాశాలల వరకు ఉండగా సుమారు 18 వేలమంది ఉన్నారు. వీరంతా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ప్రీ-ఫైనల్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. మరోవైపు థియరీ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సిలబస్‌ను నూరుశాతం పూర్తిచేసేందుకు కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నాయి. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో తమ ప్రతిభా సామర్థ్యాలను/మార్కులను తెలుసుకుని, తదుపరి జరిగే థియరీ పరీక్షల నాటికి లోటుపాట్లను అధిగమించేందుకు ప్రీ-ఫైనల్ పరీక్షలను ఓ కొలమానంగా పరిగణిస్తారు.

400లకు పైగా బస్సుల తరలింపు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వున్న ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 400లకు పైగా బస్సులు, వాహనాలను విజయవాడ కార్యక్రమం నిమిత్తం రవాణా శాఖ సేకరించినట్టు తెలుస్తోంది. ఈ వాహనాలన్నింటినీ గురువారం సాయంత్రమే తమకు అప్పగించాలని అధికార యంత్రాంగం సూచించింది. కాగా పాఠశాలలకు ఆదివారం వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించిన నేపథ్యంలో విజయవాడ కార్యక్రమానికి బస్సులను పంపేందుకు యాజమాన్యాల నుంచి ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాకపోయినప్పటికీ, ముఖ్యంగా తరగతులు జరుగుతున్న జూనియర్ కళాశాలలు,ఇతర కళాశాలల నుంచి ఒకింత వ్యతిరేకత వచ్చినట్టు సమాచారం. సాధారణంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో అత్యధికులు కనీసం 30 కిలోమీటర్ల పైబడి దూరం నుంచి కళాశాలలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ ప్రకారం శుక్రవారం తరగతులుకు హాజరయ్యేందుకు వీరందరిపైనా ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. దీనిపై ఓ ప్రైవేటు కళాశాల ప్రతినిధి మాట్లాడుతూ 'విజయవాడలో నిర్వహించే కార్యక్రమానికి బస్సుల న్నింటినీ ఇవ్వాలని రవాణాశాఖ అధికారులు అడిగారు. అన్ని బస్సులను ఇస్తే దూరప్రాంతాల విద్యార్థులు కళాశాలకు రాలేరని చెప్పాం. కనీసం సగం సంఖ్యలోనైనా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. ప్రభు త్వంతో మాకు పనులు ఉంటాయి కనుక ఇవ్వకతప్ప లేదు. అందుబాటులో వున్న బస్సులనే ఆయా రూట్లలో ఆపరేట్‌చేసి వీలైనంత ఎక్కువమంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చూస్తాం. అయినప్పటికీ కొంతమేర ప్రభావం తప్పదు ' అని వివరించారు. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ప్రీ-ఫైనల్ పరీక్షలకు దూరప్రాంత విద్యార్థులు హాజరయ్యేందుకు బస్సుల తరలింపు దృష్ట్యా కొంతమేర ప్రభావం తప్పదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ప్రచార ఆర్భాటం

ఉమ్మడి జిల్లాల నుంచి 200 ఆర్టీసీ బస్సులు
నియోజకవర్గాల వారీగా కేటాయింపు
భోజన వసతి కోసం రూ. 15 వేలు
ఏర్పాటు చేసే బాధ్యత ఎమ్మెల్యేలదే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం కోసం ప్రభుత్వం జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. ప్రభుత్వమే ఖర్చులు భరిస్తోంది. జిల్లా నుంచి 107 ఆర్టీసీ బస్సుల్లో జనాలను తరలిస్తున్నారు. ముందుగానే సర్వే నిర్వహించి ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేసుకున్నారు. నియోజక వర్గాల వారీగా బస్సులను కేటాయించారు. వారికి మార్గమధ్యంలోనే భోజన వసతి ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యేలే ఆ బాధ్యతను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకోసం ఒక్కో బస్సుకు ప్రభుత్వమే రూ.15 వేలు వంతున నిధులు కేటాయించింది. ఇలా జిల్లాలో 107 బస్సులకు భోజన వసతి కసం రూ. 16.05 లక్షలు కేటాయిస్తోంది. ఆ భారమంతా అంతిమంగా ప్రజలపైనే పడనుంది, నిజానికి ఒక జిల్లాలో ఏదైనా కార్యక్రమం జరిగితే ఆ పరిసర ప్రాంతాల నుంచి జనసమీకరణ చేస్తారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి జనాలను తర లిస్తున్నారు. అందుకోసం కోట్లు వెచ్చిస్తున్నారు. జిల్లా



నుంచి పాఠశాల బస్సులను తరలించాలని యోచించారు. అయితే దూరాభారం కావడంతో ఆ ప్రతిపాదన విరమించుకున్నారు.

ఏలూరు జిల్లా నుంచి 100 బస్సులు

ఏలూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలకు చెందిన 100 బస్సులను కార్యకర్తలను తరలించేందుకు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఆర్టీసీ సంక్రాంతి మూడురోజులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సులు వేశామని చెప్పినా ఆచరణలో ప్రత్యేక బస్సులు కనిపించలేదు. ఫలితంగా ప్రైవేట్ ట్రావెల్స్‌ను అధిక ధరలు చెల్లించి ప్రయాణాలు సాగించారు. ఇప్పుడు జిల్లాలోని మూడు డిపోల నుంచి 100 బస్సులు పంపించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

నేటి నుంచి జిల్లాలో కులగణన సర్వే



భీమవరం, జనవరి 18 : సమాజంలో వివిధ వర్గాల స్థితిగతులను తెలుసుకోనే లక్ష్యంతో ప్రభుత్వం శుక్రవారం నుంచి కులగణన చేపట్టనున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేటులో అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలోని 6 లక్షల 40 వేల 610 గృహా లకు సుమారు 20 లక్షల 68 వేల 500 జనాభాకు సంబంధించి కుల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికోసం 7,051 మంది ఎన్యూమరేటర్లను, 1,107 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఈనెల 19-28 మధ్య ఇంటింటి సర్వే, 29 నుంచి ఫిబ్రవరి 28 వరకూ మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ, ఫిబ్రవరి 15 వరకు సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ చేసి జాబితా ఖరారు చేస్తారన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయాల అధికారి అప్పారావు, ఆర్డీవోలు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు శిక్షణ త్వరగా పూర్తిచెయ్యండి : కలెక్టర్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టరు ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల అధికారులతో సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అప్లికేషన్లు, పోస్టల్ బ్యాలెట్,అభ్యర్థుల ఖర్చుల వివరాలు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, సీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ప్రసాద యాదవ్, డ్వామా పీడీ రాజేశ్వరరావు, డీఎస్పీ శరత్ రాజకుమార్, ఎన్నికల తహసీల్దారు దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 18 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు డీఈవో పి.శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 5,366 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో ఉదయం 10.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్, చేతిగడియారం, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువు లను తీసుకురావద్దని, ఒకవేళ ఈ వస్తువులతో ఎవరైనా పట్టుబడితే సంబంధిత విద్యార్థి పరీక్షను రద్దు చేస్తామని హెచ్చరించారు.

21 వరకు సంక్రాంతి సెలవులు పొడిగింపు

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 18 : జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రకటించిన సంక్రాంతి సెలవులను ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. ఈనెల 22న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయన్నారు.

ఇసుక బాదుడు

ర్యాంపుల్లో ధరలు పెంపు ?

పాలకొల్లు, జనవరి, 18 : ఇసుక అక్రమ ఎగుమతుల ద్వారా కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది. ఇసుక ర్యాంపులలో ఎగుమతుల ధరలు పెంచడానికి రంగం సిద్ధం చేస్తు న్నారు. వందల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తాడేపల్లికి తరలిస్తున్న పరిస్థితుల్లో మరో దఫా భవన నిర్మాణదారులను నిలువుదోపిడీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. ర్యాంపులలో ఇసుక ఎగుమతికి టన్నుకు రూ.475 వసూలు చేస్తున్నారు. ఇప్పుడు వాటికి అదనంగా ట్రాక్టరుకి రూ.500, 2 లేక 3 యూనిట్ల లారీకి రూ. వెయ్యి 5 యూనిట్లు అయితే రూ.15 వందలు, 6 యూనిట్లకు పైబడిన లారీలకు రూ.2 వేలు అదనంగా వసూలు చేయాలని తాడేపల్లి నుంచి తూర్పు, పశ్చిమ పాత జిల్లాలోని ఇసుక ర్యాంపులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఇవి అమలులోకి వస్తే వినియోగదారులకు మరింత భారం పడే అవకాశాలు ఉన్నాయి

దోపిడీ అరికట్టాలి



ఇప్పటికే టిప్పర్ లారీల మనుగడ ప్రశ్నార్థకంగా ఉంది. ర్యాంపులలో ఇసుక ఎగుమతుదారులు పెంచు కుంటూ వెళితే వినియోగదారులపై మరింత భారం పెరుగుతుంది. ఇప్పుడు 5 యూనిట్ల ఇసుక దూరాన్ని బట్టి రూ.13 వేల నుంచి 14 వేల మధ్య రవాణా చేస్తు న్నాం. ర్యాంపులలో పెంచిన ధరలు అమలు చేస్తే 5 యూనిట్ల ఇసుకు రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకూ చెల్లించాల్సి ఉంటుంది.

రావూరి రాజా, గోదావరి క్వారీ లారీల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పండుగలు వెళ్లినా.. ధాన్యం సొమ్ములేవీ ?

భీమవరం జనవరి 18 : పండుగలు వెళ్లిపోయాయి.. అయినా ఇంకా ధాన్యం బకాయిలు చెల్లింపులు జరగ లేదు.. జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి 561 ఆర్బీకేల ద్వారా గతనెల 22 తేదీవరకు 47,324 మంది రైతుల నుంచి రూ 686.22 కోట్లు విలువైన 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ధాన్యం విక్రయించిన తర్వాత నిర్ణీత గడువు 21 రోజులు కాగా మూడు నాలుగు రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లిస్తున్నట్టు అధికారులు చెప్పేవారు. 27 రోజులు దాటినా చెల్లింపులు జరగడం లేదని రైతుల ఆవేదన చెందుతున్నారు. 4,632 మంది రైతులకు సంబంధించి రూ.66.35 కోట్లు చెల్లించాల్సి ఉండగా సుమారు 20 కోట్ల వరకూ చెల్లించారు. మిగిలిన సొమ్ముల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

విద్యాదీవెన ఏదీ?



బటన్ నొక్కి మూడు వారాలు
ఇప్పటికీ 20 శాతం మంది ఎదురుచూపులే
విద్యార్థులకు ప్రాణ సంకటం
కొత్తగా ఉమ్మడి ఖాతా తంటా

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం చెపుతున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోతోంది. పూర్తి స్థాయిలో విద్యార్థులకు సొమ్ములు చెల్లిస్తున్నామంటూ ప్రభుత్వం గొప్పలు చెపుతోంది. సకాలంలో విడుదల చేయకుండా తాత్సారం చేస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గడచిన డిసెంబరులో భీమవరం విచ్చేసి బటన్ నొక్కారు.కానీ ఫీజు రీఎంబర్స్‌మెంట్ సొమ్ములు పూర్తిస్థాయిలో ఇంకా జమ కాలేదు. ఇప్పటిదాకా 80 శాతం మంది విద్యార్థులకు మాత్రమే చెల్లించారు. అదికూడా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన బకాయిలను మాత్రమే చెల్లిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఒక్క క్వార్టర్ కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. తమ హయాంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అత్యధిక నిధులు వెచ్చించామంటూ ప్రభుత్వం చెప్పుకొస్తోంది. కానీ ఈ ఏడాది ఒక్క క్వార్టర్ కూడా విడుదల చేయని విషయాన్ని విస్మరించారు.ముఖ్యమంత్రి బటన్ నొక్కి మూడు వారాలు గడచినా ఇంకా 20 శాతం మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో దాదాపు 76 వేల మందికి జగనన్న విద్యాదీవెనలో ఫీజ రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. అందుకోసం రూ. 25 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారు. డిసెంబరులో బటన్ నొక్కిన దీవెనకు సంబంధించి మరో రూ. 5 కోట్లు జమ చేయాల్సి ఉంది. దానికోసం విద్యార్థులు, అటు కళాశాలల యాజమాన్యాలు వేచి చూస్తున్నాయి.

ఉమ్మడి ఖాతా అంటూ మెలిక

ప్రభుత్వం తల్లుల ఖాతాలో సొమ్ములు జమచేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేసి కళాశాలలకు చెల్లిస్తు న్నారు. దూరప్రాంతంలో చదివే విద్యార్థులకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తల్లులతో పాటు, విద్యార్థులకు ఉమ్మడి ఖాతా తెరవాలంటూ ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. దీనిపై విద్యార్థుల్లో కలకలం రేగింది. దాంతో ప్రభుత్వం ఒక మెట్టు దిగివచ్చింది. ఉమ్మడి ఖాతాను తాత్కాలికంగా వాయిదా వేసింది. అయితే ప్రథమ సంవత్సర విద్యార్థులు మాత్రం ఉమ్మడి ఖాతా తెరచుకోవాలంటూ స్పష్టం చేసింది. దీనివల్ల విద్యార్థులకు వచ్చిన అదనపు ప్రయోజనం ఏమీ లేదు. కళాశాలల నుంచి ఫీజుల కోసం ఒత్తిడి మాత్రం ఎదుర్కొంటున్నారు.

4వ సంవత్సరం విద్యార్థుల గతేమిటో

ఇంజనీరింగ్‌లో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. చివరి సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఒక్క క్వార్టర్ కూడా విడుదల చేయలేదు. మరో మూడు నెలల్లో చివరి సంవత్సరం విద్యార్థుల చదువు పూర్తికానుంది. కళాశాలలు సర్టిఫికెట్‌లు ఇవ్వాలంటూ ఫీ.జు చెల్లించాలి. కళాశాల స్థాయిని బట్టి ప్రతి విద్యార్థి గరిష్ఠంగా రూ. 73 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కనిష్ఠంగా రూ. 43 వేలు కడితేనే సర్టిఫికెట్‌లు ఇస్తున్నారు. గత ఏడాదికి సంబంధించి నాలుగో సంవత్సరం విద్యార్థులకు పూర్తిగా సొమ్ములు చెల్లించింది. ఫలితాలు విడుదలయ్యే నాటికి ప్రభుత్వం ఫీజులు జమ చేయడంతో విద్యార్థులకు కాస్త ఉపశమనం లభించింది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వం నుంచి ఫీజులు విడుదల కాకపోతే సర్టిఫికెట్‌లు తీసుకోవడం విద్యార్థులకు కష్టం కానుంది. ఫీజులు చెల్లించాలి. సొంత సొమ్ములు భరించాలి. ఇదే విషయమై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజుల నిర్ధారణపై మీమాంస

కళాశాలలు ఫీజులను పెంచాలంటూ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఫీజు నిర్ధారణ కమిటీ సిఫారసులు కూడా ప్రభుత్వానికి అందాయి. జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలకు గరిష్ఠ ఫీజు రూ. 1.03 లక్షలుగా కమిటీ సిఫారసు చేసింది. కనిష్ఠ ఫీజు రూ. 43 వేలుగా నిర్ధారించింది. పెంచిన ఫీజులపై ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గరిష్ఠంగా రూ. 73 వేలు మాత్రమే చెల్లిస్తోంది. దాంతో యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. తెలుగుదేశం హయాంలో కమిటీ నిర్ధారించిన మొత్తాన్ని అమలు చేసేవారు. ప్రభుత్వం నిర్ణీత మొత్తాన్ని చెల్లించేది. 10 వేల ర్యాంకు దాకా ఎంత ఫీజు అయినా సరే ప్రభుత్వం భరించేది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కూడా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించేది. కళాశాలల ఖాతాలోనే సొమ్ములు జమ చేసేవారు. విద్యార్థులకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందన్న విశ్వసనీయత యాజమాన్యాల్లో ఉండేది. ఈ ప్రభుత్వం కమిటీ సిఫారసులను బుట్టదాఖలు చేస్తోంది. ప్రభుత్వం నిర్ధారించిన ఫీజులను మాత్రమే అమలు చేస్తామంటూ స్పష్టం చేస్తోంది. అందుకు అంగీకరించిన కళాశాలలకే గత బకాయిలను చెల్లించింది. ఇలా కళాశాలల మెడపైనా ప్రభుత్వం కత్తి పెడుతోంది.

పీజీ విద్యార్థులకు దక్కేనా

డిగ్రీ పూర్తయిన విద్యార్థులు పీజీ కోర్సులు చేసినా సరే గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలయ్యేది. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీజీ కోర్సులకు జగనన్న విద్యాదీవెన అమలు చేయడం లేదు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే పీజీ కోర్సులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. జిల్లాలో సుమారు రూ.30 కోట్ల మేర చెల్లించాలి.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18 : ఉప్పరగూడెంలో ప్రతీ ఏటా సంక్రాంతికి నిర్వహించే రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు గురువారం రసవత్తరంగా సాగాయి. నెల్లూరు, కృష్ణా, ఏలూరు జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 25 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల్లో విజేతకు రూ.30వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, మూడో బహుమతిగా రూ.20వేలు, నాలుగో బహుమతికి రూ.10వేలు అందిస్తారు. శుక్రవారం తుదిపోరు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సెమీఫైనల్స్ కృష్ణా జిల్లా, నెల్లూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లా జట్లు తలపడనున్నాయి.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పెదతాడేపల్లి బ్యాండ్ టీమ్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18 : ఢిల్లీలో నిర్వహించే ముందస్తు గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గురువారం విమానంలో ఢిల్లీ బయల్దేరినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. ఢిల్లీలో ఈనెల 21, 22 తేదీల్లో ధ్యాన్‌చంద్ స్టేడియంలో నిర్వహించే స్కూల్ బ్యాండ్ టీమ్ పోటీల్లో సౌత్‌జోన్ తరపున పాల్గొంటాయని వివరించారు. దేశ రక్షణ, విద్యాశాఖల ఆధ్వర్యంలో దేశ నలుమూలల నుంచి 16 బ్యాండ్ టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. విద్యార్థులకు విమాన టికెట్‌లు ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

21న జిల్లా అదనపు కోర్టు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రకాష్‌బాబు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18: తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో ఈనెల 21న జిల్లా అదనపు కోర్టును ప్రారంభిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రకాష్‌బాబు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదనపు కోర్టు ప్రారంభోత్సవానికి ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి శేషసాయి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ భానుమతి, జస్టిస్ సత్తిసుబ్బారెడ్డి, జస్టిస్ వి. గోపాలకృష్ణ హాజరవుతారని వివరించారు. రూ.50 లక్షల పైబడి సివిల్ కేసుల వివాదాలు పరిష్కరించబడతాయని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు సీట్లు కేటాయించాలి


అప్పిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అంబికా కృష్ణ

ఏలూరుటూటౌన్, జనవరి 18:రానున్న ఎన్నికల్లో ప్రతీ రాజకీయ పార్టీ ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అంబికా కృష్ణ అన్నారు. విజయవాడలోని వైసీపీ ప్రధాన కార్యదర్శి యాళ్ల అప్పిరెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే ఆర్యవైశ్య అభ్యర్థుల జాబితాను సమర్పించామన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని అప్పిరెడ్డి తెలిపారన్నారు. అనంతరం గుంటూరులో రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. కన్యాకపరమేశ్వరి అమ్మవారి గుడి సెంటర్ నుంచి హిమని సెంటర్ వరకు పాదయాత్ర జరిగినట్టు తెలిపారు.

రేపు పాలకొల్లులో ఆక్వా సంఘ 2కే ర్యాలీ

పాలకొల్లు, జనవరి 18 : ఆక్వా రైతు సంక్షోభం నుంచి గట్టెక్కాలనే ఉద్దేశంతో శనివారం పాలకొల్లులో జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం ఆధ్వర్యంలో 2కే ర్యాలీని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, కార్యదర్శి బి.వెంకటనరసయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వాసాగు మరింత అధ్వానంగా ఉందని, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. హేచరీల నుంచి నాణ్యమైన సీడ్ లభించడం లేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. విపత్కర పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోతు న్నారన్నారు. ప్రాసెసింగ్ ప్లాంట్ ద్వారా రైతులకు సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు. ఈ మేరకు ఆక్వారైతు సమస్యలను ప్రపంచానికి తెలిపేలా ర్యాలీని చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీ పూలపల్లి వై.జంక్షన్ నుంచి లాకుల మీదుగా గాంధీబొమ్మల సెంటర్‌కు చేరుకుని మెయిన్‌రోడ్డు, పెదగోపురం, కారుమూరివారి వీధి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ర్యాలీ అనంతరం ఆక్వారైతు సమస్యలపై సభను ఏర్పాటు చేశామన్నారు. రైతులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేత 'కాళ్లపాలెం'


కాళ్లపాలెం వెంకటరత్నం జట్టుకు ప్రథమ బహుమతి అందించి సత్కరిస్తున్న సీఐ

కలిదిండి, జనవరి 18 : రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీ ల్లో కాళ్లపాలెం మేడిశెట్టి వెంకటరత్నం జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఆకివీడు లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగు డు పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానం సాధించిన కాళ్లపాలెం జట్టుకు రూ.25 వేలు నగదు, షీల్డ్‌ను ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ అందజేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, చందన ఉమామహేశ్వరరావు, బొర్రా సత్యవతి, పేటేటి స్వర్ణ కుమారి, రామకృష్ణ జట్టు సభ్యులను గురువారం అభినందించారు.

కొత్తపట్టిసీమ, భీమడోలు సర్పంచ్‌లకు అభినందనలు



కొత్తపట్టిసీమ సర్పంచ్ విజయదుర్గను అభినందిస్తున్న కేంద్ర మంత్రి

పోలవరం, జనవరి 18 : ఏలూరు జిల్లా ప్రతిష్టను కొత్త పట్టిసీమ, భీమడోలు పంచాయతీ సర్పంచ్‌లు పెంచారని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాధ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ ఆరోగ్యవంతమైన జాతీయ స్థాయి గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, భీమడోలు సర్పంచ్ పాము సునీత ఎంపికై పురస్కారం పొందడపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు సర్పంచ్‌లు కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, రాష్ట్ర మంత్రులు, ఇతర దేశాల ప్రముఖుల సమక్షంలో ఆరోగ్యవంతమైన గ్రామ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు సర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో సర్వర్ కష్టాలు

▸ కేశఖండన శాల వద్ద భక్తుల ఇక్కట్లు
▸ మూడు గంటల పాటు అంతరాయం.. అధికారుల తీరుపై ఆగ్రహం


శ్రీవారి కేశఖండనశాల కౌంటర్ వద్ద వేచి వున్న భక్తులు

ద్వారకాతిరుమల, జనవరి 18 : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి మొక్కుబడులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం వేలాదిగా తరలివచ్చే ఈ క్షేత్ర కేశ ఖండనశాలలో గురువారం భక్తులకు టికెట్లు ఇచ్చే కౌంటర్‌లో సాంకేతికలోపం ఏర్పడింది. సంక్రాంతి పర్వదినం అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆన్‌లైన్ టికెట్లు ఇస్తున్న క్రమంలో ఒక్కసారిగా సర్వర్ ఆగిపోయింది. టికెట్ విక్రయాలు నిలిచి పోవడంతో దాదాపు మూడు గంటల పాటు భక్తులు కౌంటర్ల వద్ద వేచిఉండాల్సి వచ్చింది. సాఫ్ట్‌వేర్ సమస్య అంటూ అక్కడి అధికారులు హడావుడి చేయడమే మినహా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. భక్తులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. చిన్నపిల్లలతో ఎంత సమయం ఎదురు చూడాలంటూ మండిపడ్డారు. అనంతరం సాఫ్ట్‌వేర్‌ను తిరిగి పనిచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. క్యూలైన్లలో కిక్కిరిసిన చంటి బిడ్డల తల్లులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదర్కొన్నారు. చాలాసమయం తరువాత వినియోగంలోకి రావడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. మాన్యువల్‌గా టికెట్లు ఇచ్చే అవకాశం లేదని ఆలయ ఏఈవో పి.నటరాజారావు వివరణ ఇచ్చారు.

నిడమర్రులో విజృంభిస్తున్న విషజ్వరాలు

▸ అప్రమత్తమైన వైద్యాధికారుల బృందం


నిడమర్రులో ఫీవర్ సర్వేలో పాల్గొన్న వైద్యాధికారులు

నిడమర్రు జనవరి 18 : నిడమర్రులో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మేజర్ పంచాయతీ నిడమర్రులో పారిశుధ్యం లోపించడంతో మురుగునీరు పోయే మార్గాలు స్తంభించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల బెడదతో రోజురోజుకు జ్వరాల భారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. పెదనింద్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో విజృంభిస్తున్న విషజ్వరాలపై స్పందించిన డీఎంహెచ్‌వో నాగేశ్వరరావు బుధవారం సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా వైద్యాధికారుల బృందం ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తుందని, ఇప్పటివరకు ఆరు జ్వర కేసులు గుర్తించామని వారికి డెంగీ టెస్టులు నిర్వహించగా నెగిటివ్ వచ్చాయన్నారు. సాధారణ జ్వర కేసులను రోజువారి పరీక్షలు నిర్వహించి వైద్య బృందం పర్యవేక్షణలో ఉంచామన్నారు. పంచాయతీ సిబ్బందిని గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు బ్లీచింగ్ చల్లించాలని సూచించామన్నారు. ఎవరికైనా జ్వరాలు వస్తే వెంటనే ఆశా కార్యకర్తలను, సచివాలయ వైద్య సిబ్బందిని సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలని సూచిస్తున్నామన్నారు. కార్యక్రమం ఎంపీహెచ్‌వో కృపావరం, వైద్యధికారులు పాల్గొన్నారు.

రేపు మొగల్తూరులో ఉచిత వైద్య శిబిరం

▸ కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి



మొగల్తూరు, జనవరి 18 : కేంద్ర మాజీ మంత్రి, దివంగత యూవీ కృష్ణంరాజు జయంతి పురస్కరించుకుని 20వ తేదీన మొగల్తూరులో షుగర్, గ్యాంగ్రీన్ వ్యాధులకు సంబంధించి మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సొంతూరు మొగల్తూరు అంటే కృష్ణంరాజుకు ఎంతో మమకారంతో ఉండేవారన్నారు. ఆయన జయంతి పురస్కరించుకుని పేదలకు అందని ఎంతో వ్యయంతో కూడిన షుగర్ వ్యాధి కారణంగా వచ్చే గ్యాంగ్రీన్ అనే వ్యాధి సోకినవారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లండన్‌కు చెందిన ప్రముఖ గ్యాంగ్రీన్ వైద్య నిపుణుడు కవర్తపు వేణు కృష్ణంరాజుపై ఉన్న అభిమానంతో వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా వస్తున్నారన్నారు. లండన్, అబుదాబి, హైదరాబాద్, విజయవాడ, భీమవరానికి చెందిన 30మంది ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు. తమ కుటుంబ వారసుడు హీరో ప్రభాస్, తమ కుమార్తెలు కృష్ణంరాజు పేరిట విద్య, వైద్య సేవలందించేందుకు సహకరిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో వైద్య సేవలు పొందేవారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో దాసరి బాబి, గ్రామీణ వైద్య సంఘ నాయకులు కేఎస్‌పీఎన్ ముక్తేశ్వరరావు, సీహెచ్‌వీపీ శ్రీనివాస ప్రసాద్, పులపర్తి రమేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

కృష్ణంరాజు లేకుండా సొంతూరు రావడం బాధిస్తోంది..

తన భర్త కృష్ణంరాజు లేకుండా సొంతూరు మొగల్తూరుకు రావడం ఎంతో బాధ కలిగిస్తుందని ఆమె ఆవేదనన వ్యక్తం చేశారు. గురువారం ఆమెను కలిసిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో మాట్లాడారు. గ్యాంగ్రీన్ ఆపరేషన్‌కు సుమారు రూ.50 లక్షలు వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని ప్రతీ ఏటా ఉచితంగా ఈ రకమైన వైద్య సేవలందించేందుకు తమ కుటుంబం నిర్ణయం తీసుకుందని మాధవనాయుడుకు ఆమె తెలిపారు.

క్రైం కార్నర్

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ..

▸ ప్రయాణికుడి దుర్మరణం


లారీని ఢీకొని బోల్తాపడ్డ లారీ

మొగల్తూరు, జనవరి 18 : మొగల్తూరు హైవేపై నల్లంవారితోట సమీపంలో ఆగి వున్న లారీని మరో లారీ ఢీకొనడంతో అందులోని ప్రయాణికుడు మృతి చెందాడని ఏఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. కృష్ణాజిల్లా ఘంటశాల మండలం శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం వెళుతున్న ధాన్యం లోడు లారీ మొగల్తూరు జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని గురువారం వేకువజామున ఢీకొని బోదెలో బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ప్రయాణిస్తున్న మాదాసు నాగబాబు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి వరుసకు సోదరుడైన సీతా రాంబాబు మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

దెందులూరు, జనవరి 18 : బిల్డింగ్‌పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలివి.. శ్రీరామవరానికి చెందిన బొర్రా శేషయ్య కుమారుడు రవి(30)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. మృతుడికి రెండేళ్ల బాబు ఉండగా, నెలరోజుల క్రితం మరో బాబు జన్మించాడు. బుధవారం రాత్రి గాలి సక్రమంగా రావడం లేదని బిల్డింగ్‌పై పడుకుందామని రాత్రి 11 గంటల సమయంలో పైకి ఎక్కి పడుకున్నాడు. ఉదయం లేచి తండ్రి చూసే సమయానికి రవి కింద పడి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. తెల్లవారుజామున మంచినీళ్ల కోసం లేచి రక్షణ గోడ లేకపోవడం వల్ల నిద్ర మత్తులో కిందపడి ఉండొచ్చని అనుకుంటున్నారు. మృతదేహం వద్ద భార్య రెండేళ్ల బాబు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

దూసుకొచ్చిన కారు... తప్పిన పెనుప్రమాదం


వినాయక పాదాల వద్ద ఢీకొట్టిన కారు

ఆకివీడు, జనవరి 18: ఓ యువకుడు బుధవారం కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న సమయంలో బ్రేకుకు బదులు ఎక్స్‌లేటర్ నొక్కడంతో రోడ్డుమీద నుంచి శాంతినగర్ వరసిద్ధి వినాయక దేవాలయంలోకి గేటును ఢీకొట్టి దూసుకొచ్చింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక పాదాలను ఢీకొట్టడంతో ఆ ప్రాంతంలోని వస్తువులు విరిగిపోయా యి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారు ఎదర భాగంగా పూర్తిగా దెబ్బతినడంతోపాటు భక్తులు కూర్చునే బల్లలు, పాదాల దగ్గర సిమెంట్ గోడలు దెబ్బతిన్నాయి. ఆలయంలో మరమ్మతులు చేయిస్తాననడంతో యువకుడు చెప్పడంతో వివాదం సద్దుమనిగింది.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

పోలవరం, జనవరి 18 : మోటారు బైక్‌ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు స్వల్పగాయాలైన ఘటన గురువారం పోలవరంలో జరిగింది. స్థానిక ఏటిగట్టు సెంటర్‌లోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో పోలవరం ప్రాజెక్టు కార్మికులు ఇద్దరు బైకుపై పోలవరం ప్రాజెక్టు వైపు వెళుతుండగా తహసీల్దార్ కార్యాలయం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో బైక్‌నుంచి ఇద్దరు కార్మికులు కింద పడిపోయారు. అదే సమయంలో ఎన్టీఆర్ వర్థంతి జరుపుతున్న స్థానిక టీడీపీ మండల నాయకులు గాయాలపాలైన వారికి సహాయక చర్యలందించి ఆస్పత్రికి పంపించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారుల స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అశ్లీల డ్యాన్స్‌లు..

యలమంచిలి, జనవరి 18: సంక్రాంతి పండుగ సందర్భంగా యలమంచిలి, ఆచంట మండలాల సరిహద్దు ప్రాంతంలో అశ్లీలంగా, అసభ్యకరమైన రికార్డింగ్ డాన్స్‌లు జరిగాయి. అర్ధరాత్రి సమయంలో విచ్చలవిడిగా మహిళలతో అశ్లీలంగా డ్యాన్స్‌లు నిర్వహించారు. రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో నిర్వాహకులు బరితెగించారని సమాచారం. ఈ అసభ్యకరమైన డ్యాన్స్‌లు జరిగిన ప్రాంతం ఏ మండలం పరిధిలోకి వస్తుందో తేల్చడంపై పలువురు అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిసింది.

బాలుడిపై పాస్టర్ దాడి.. కేసు నమోదు

ఆగిరిపల్లి, జనవరి 18: ఆడుకొంటున్న ఓ బాలుడిని పాస్టర్ గాయపరిచినట్టు అందిన ఫిర్యాదుపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. ఈదులగూడెంకు చెందిన ఐయ్యంకి జోయల్‌బాబు(12) స్నేహితులతో కలిసి ఆర్సీఎం చర్చి వద్ద ఖాళీ స్థలంలో వాలీబాల్ ఆడుకుంటున్నాడు. బాలు తీసుకొచ్చేందుకు సమీపంలో చెట్టుకు కట్టేసిఉన్న పాస్టర్ మన్నెం శరత్ పెంపుడుకుక్క దగ్గరకు వెళ్లాడు. పాస్టర్ రాళ్లు విసరగా స్నేహితులంతా పారిపోయారు. సైకిల్ తెచ్చుకునేందుకు వెళ్లిన జోయల్‌బాబును పాస్టర్ కర్రతో కుడిచేతిపై బలంగా కొట్టడంతో గాయపడ్డాడు. బాధితుడి తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు ఎస్ఐ చంటిబాబు తెలిపారు. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 18 : చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్నారని ట్రాన్స్‌కో విజిలెన్సు అధికారులకు సమాచారం అందడంతో గురువారం తనిఖీలు చేపట్టారు. దెందులూరు మండలం సత్యనారాయణపురం గ్రామంలో చేపల చెరువుకు ఉన్న విద్యుత్ కనెక్షన్లను ఏలూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.శ్రీవాస్, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి, విజిలెన్స్ అండ్ ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ చేపల చెరువు యజమానిపై కేసు నమోదు చేసి రూ.1,13,313 అపరాధ రుసుము, ఎనిమిది వేల రూపాయల జరిమానా విధించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

కేపీపాలెం తీరంలో దొంగల దోపిడీ

మొగల్తూరు, జనవరి 18 : కేపీపాలెం తీర గ్రామాల్లో రెండు గృహాల్లో దొంగలు దోపిడీకి పాల్పడినట్టు తెలిసింది. కేపీపాలెం నార్త్ పంచాయతీ తెన్నేటివారిపేటకు చెందిన వ్యక్తి అదే ప్రాంతంలో భవనం నిర్మించుకున్నాడు. ఇంటి యజమాని జీవనోపాధికై కువైట్‌లో ఉంటుండగా అతడి భార్య రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్ళడంతో ఇల్లు తాళం వేసి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు తలుపులు పగులుకొట్టి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తస్కరించినట్టు తెలిసింది. అదేవిధంగా కేపీపాలెం సౌత్‌లో ఒక గృహ యజమాని.. తన భార్యతో కలిసి అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లడంతో ఆ ఇల్లు తాళం వేసి ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు బుధవారం రాత్రి సమయంలో ఆ గృహం తలుపులు పగుల కొట్టి వెండి వస్తువులు దొంగిలించినట్టు సమాచారం. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఆన్‌లైన్ మోసం

▸ జంగారెడ్డిగూడెంలో రూ.66,500 మోసపోయిన మహిళ

జంగారెడ్డిగూడెం, జనవరి 18 : ఆన్‌లైన్ మోసానికి మరో మహిళ నష్టపోయింది. ట్రైనీ డీఎస్పీ విద్య తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ మహిళకు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో గత ఏడాది డిసెంబరులో అమెజాన్ షాపింగ్ స్టోర్ లింక్ వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగమని, అధిక ఆదాయం సంపాదించవచ్చని లింక్‌లో పేర్కొనడంతో లింక్‌ను క్లిక్ చేసిందన్నారు. స్టోర్ ద్వారా వస్తువులను కొనుగోలు చేసి అమ్మకాలు చేయాల్సి ఉంటుందని తెలపడంతో వారు పేర్కొన్న టాస్కులను పూర్తిచేసి, వస్తువుల కొనుగోలుకు దఫదఫాలుగా రూ.66,500 నగదును లింక్‌లో పేర్కొన్న యాప్‌కు మహిళ పంపిందన్నారు. ఎన్ని రోజులైనా జమచేసిన నగదు విత్‌డ్రా కాకపోవడంతో సదరు మహిళ తాను మోసపోయానని గ్రహించి ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

బిర్యాని పాయింట్ యజమానిపై కేసు

▸ 23 గ్యాస్ సిలిండర్లు సీజ్


జంగారెడ్డిగూడెంలో సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లు

జంగారెడ్డిగూడెం, జనవరి 18 : వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాలతో జంగారెడ్డిగూడెం పట్టణంలోని ముబాకర్ కచ్చా బిర్యానీ పాయింట్‌లో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.61,120 విలువ చేసే 23 గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేసి బిర్యాని పాయింట్ యజమాని షేక్ అబ్దుల్ వాహెబ్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, సివిల్ సప్లైస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.


భీమడోలు హైస్కూలులో ఘర్షణకు దిగిన యువకులు

'ఆడుదాం ఆంధ్రా'లో కొట్లాట

భీమడోలు, జనవరి 18 : భీమడోలు హైస్కూలులో జరుగుతున్న క్రీడా పోటీల్లో గురువారం ఘర్షణ వాతావరణం నెలకొంది. పోటీల్లో భాగంగా హైస్కూలు గ్రౌండ్‌లో కబడ్డీ పోటీల్లో ఆగడాలలంక, పూళ్ళ జట్లు తలపడ్డాయి. పూళ్ళ జట్టు విజయం సాధించింది. ఈ క్రమంలో ఓడిపోయిన ఆగడాలలంక జట్టు క్రీడాకారులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కొంతమంది బయట యువకులు పరస్పర దాడులకు దిగారు. హైస్కూలు ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీనిపై సోషల్ మీడియాలో క్రీడాకారులు కొట్టుకుని అంపైర్‌పై దాడి చేశారని ప్రచారం జరిగింది.

● బయట వ్యక్తులే కొట్టుకున్నారు..

భీమడోలు హైస్కూలులో కబడ్డీ పోటీల్లో క్రీడాకారుల మధ్య ఎటువంటి కొట్లాట జరుగలేదని అంపైర్‌పై కూడా దాడి చేయలేదని ఎంపీడీవో పద్మావతితో పాటు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సోషల్ మీడియా ఇతర సమాచార మాధ్యమాల్లో జరిగిన ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆగడాలలంకకు చెందిన పంతగాని అక్బర్ అనే వ్యక్తి తమ జట్టు ఓడిపోయిన కారణంగా కొంతమందిపై దుర్భాషలు ఆడడంతో వివాదం మొదలైందని.. దీనిలో క్రీడాకారుల ప్రమేయం లేదన్నారు. అక్బర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

▸ జాతీయ రహదారిపై డ్రైవర్లు, క్లీనర్ల నిరసన


సింగవరం వద్ద డ్రైవర్లు, క్లీనర్ల నిరసన

దెందులూరు,జనవరి 18 : డ్రైవర్లు, క్లీనర్లను ఇబ్బందులకు గురిచేసే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం ప్రకారం శిక్షా కాలాన్ని పెంచడాన్ని నిరసిస్తూ భీమడోలుకు చెందిన జయహో రథసారథి డ్రైవర్ల, క్లీనర్ల యూనియన్ నాయకులు సమ్మెకు దిగారు. గురువారం గుండుగొలను సమీపంలోని సింగవరం జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేసి జీవోను వెంటనే రద్దు చేయాలని నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఈ కొత్త చట్టం వల్ల డ్రైవర్లు ప్రమాదం చేసి పారిపోయినందుకు పదేళ్ల శిక్ష విధించబడుతుందని, అంతకు ముందు నిందితుడికి రెండేళ్ల వరకు మాత్రమే శిక్ష ఉండేదన్నారు. హైవేపై ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిచిపోయింది. దెందులూరు ఎస్ఐ స్వామి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా యూనియన్ నాయకులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జయహో రథసారథి డ్రైవర్ల, క్లీనర్ల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా యోగి వేమన జయంతి


యోగి వేమను చిత్రపటాలను అందుకుంటున్న దర్శక, నిర్మాతలు కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి

అత్తిలి, జనవరి 18: ప్రజాకవి శ్రీయోగి వేమనకు ఆరవల్లి గ్రామంలో మందిరం నిర్మించి ప్రతీ ఏడాది మాదిరిగా జనవరి 18న జయంతిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయంనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేమనను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలు, కోలాటం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై వేమన చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. వేమన పల్లకి కింద నుంచి తల్లిదండ్రులు తమ చిన్నారులను దాటించారు. ఈవిధంగా చేయడం వల్ల పిల్లలకు ఆయుష్షు పెరుగుతుందని గ్రామస్థుల నమ్మకం. ఆలయ కమిటీ ఛైర్మన్ వెలగల అమ్మిరెడ్డి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆరవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శునకాలకు అన్నదానం చేశారు.

వెంకటకృష్ణాపురంలో భూవివాదం

▸ ఇరువర్గాలు పరస్పరం ఒకరిపై మరొకరి దాడి
▸ ఏలూరు ఆస్పత్రికి తరలింపు

ద్వారకాతిరుమల, జనవరి 18 :భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పరం ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్న ఘటనలో ఐదుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలైన ఘటన వెంకటకృష్ణాపురంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటకు చెందిన గోపా నాగేశ్వరరావుకు వెంకటకృష్ణాపురానికి చెందిన పాకలపాటి రామ్మోహనరావు కుమారులకు గ్రామంలోని 107 సర్వే నంబరు భూమిపై తగాదాలున్నాయి. ఇందుకు సంబంధించి కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం రెండు వర్గాల వారు భూమి తమదంటే తమదని కర్రలతో దాడి చేసుకున్నారు. గోపా నాగేశ్వరరావు, గోపా వెంకటేశ్వరరావు, గోపా బాలబాలాజీ, గోపా సత్యన్నారాయణ, గదుల సత్యన్నారాయణలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ముందుగా స్థానిక పీహెచ్‌సీకి ప్రథమ చికిత్స నిమిత్తం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు.

జామాయిల్ ట్రాక్టర్ బోల్తా- వ్యక్తికి గాయాలు

చాట్రాయి, జనవరి 18: జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గురువారం రాత్రి చాట్రాయి ఊరచెరువు దగ్గర బోల్తా పడడంతో కర్రలు మీదపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. పామాయిల్ కర్రల లోడుతో ట్రాక్టర్ చాట్రాయి వైపు వస్తుండగా, అదే సమయంలో బచ్చు శరణ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఆరుగొలనుపేట వెళుతున్నాడు. ట్రాక్టర్ బోల్తాకొట్టి కర్రలు అతడిపై పడ్డాయి. వెంటనే స్థానికులు స్పందించి కర్రలు తొలిగించి అతడిని బయటకు తీసి 108లో నూజివీడు ఆసుపత్రికి తరలించారు.పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు కర్రలు తగలడంతో సరఫరా నిలిచిపోగా ఆ తరువాత పునరుద్ధరించారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో ఎస్ఐ కేసీహెచ్.స్వామి సిబ్బందితో వచ్చి క్లియర్ చేశారు.

జీతాల బకాయిలు ఇప్పించండి

▸ పంచాయతీ కార్మికుల ఆవేదన
▸ కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని వైనం


పోలవరం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన (ఫైల్)

పోలవరం, జనవరి 18 : దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదన్న సామెతలా ఉంది పంచాయతీ కార్మికులు పరిస్థితి. పంచాయతీ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని పంచాయతీ కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్మికులు తమ జీతాల పెంపు కోసం, ఉద్యోగ భద్రత కోసం చేసిన సమ్మె కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉద్యోగ భద్రత, జీతాల పెంపు విషయంలో నిర్దిష్ట హామీ ఇవ్వకపోయినా కార్మికులకు మద్దతుగా పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో కార్మికులు తమ జీతాల బకాయిలు నెలల తరబడి పెండింగ్ ఉం టున్నాయంటూ అప్పులు చేసి బతుకు వెళ్లదీయాల్సి వస్తుందంటూ కలెక్టర్‌కి మొరపెట్టుకోవడంతో జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, సర్పంచులు జీతాల బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంక్రాంతి పండుగలో సైతం అప్పులు చేసుకుని పండుగ పూట పొట్టగడుపుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పండుగ రోజుల్లో తమతో విధులు చేయించారన్నారు. ఇప్పటికైనా జీతాల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

వైభవంగా కొండాలమ్మ జాతర

యలమంచిలి, జనవరి 18: ఆర్యపేట గ్రామంలో శ్రీకొండాలమ్మ జాతర బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో గరగనృత్యాలు, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డప్పులతో అమ్మవారి జాతర ఘనంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ముగిసిన గంగాలమ్మ జాతర



నరసాపురం రూరల్, జనవరి 18: ఎల్‌బీచర్ల గ్రామంలోని తోట నాగేశ్వరరావు పొలంలో కొలువైన గంగాలమ్మ జాతర గురువారంతో ముగిసింది. చివరి రోజున ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఇటు పట్టణ, మండలంలోని గంగాలమ్మ, గోగులమ్మ, వనువులమ్మ, నాగాలమ్మ, అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ దర్శించుకున్నారు.

కొమ్ముచిక్కాలలో కోట్లమ్మ..

పోడూరు, జనవరి 18: కొమ్ముచిక్కాలలో కోట్లమ్మ జాతర అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల ఘటాలతో ఆసాదులు చేసిన నృత్యప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. బుట్టబొమ్మలు, కోయడాన్సులు, తీన్‌మార్, సన్నాయి డప్పులు, సాంస్కృతి కార్యక్రమాలతో జాతరను వేడుకగా నిర్వహించారు, భక్తులు అమ్మవారికి చలివిడిపానకాలు పోసి ధూపదీపాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పాలకోడేరులో పద్దాల వెంకమ్మ..



పాలకోడేరు, జనవరి 18 : పాలకోడేరు గ్రామంలో శ్రీపద్దాల వెంకమ్మ జాతరను గురువారం మేళతాళాలు, గరగ నృత్యాలు, ఆసాదుల విన్యాసాలతో మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. జాతరలో అమ్మవారికి పసుపు కుంకుమలు, చలివిడి పానకాలు, ప్రత్యేక మొక్కుబడి కావిళ్ళు, చీరా సారెలు సమర్పించారు.

యండగండిలో పోలేరమ్మ జాతర



పోలేరమ్మను అత్తారింటికి పంపిస్తున్న దృశ్యం

ఉండి, జనవరి 18 : యండగండిలో పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఆయన సోదరుడు పీవీఎస్ గోపాల కృష్ణంరాజు తదితరులు అమ్మవారి విగ్రహాలను ఘణచారులకు అందించి అమ్మవారిని అత్తరింటికి పంపించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెలరోజులుగా గ్రామ నడివీధిలో అమ్మవారు పూజలందుకున్నారు. మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాలు, బాణసంచాకాలుల మధ్య పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

కిటకిటలాడిన మావుళ్ళమ్మ ఆలయం



ఆలయం వద్ద భక్తజన సందోహం

భీమవరం టౌన్, జనవరి 18 : మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారంనాడు అమ్మవారి ఆలయంతోపాటు ఉత్సవ పందిళ్ళు భక్తులతో కిటకిలాడాయి. సాయంత్రం5 గంటల ప్రాంతం నుంచి రాత్రి 10 గంటల వరకు రద్దీ కొనసాగింది. సెలవులు ముగియటంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు తరలి రావటంతో ఈ రద్దీకొనసాగింది. భోగిరోజు నుంచి గురువారం వరకు అదే పరిస్థితి కనిపించింది. అమ్మవారి ఉత్సవాల్లో విద్దీకరణ ఆకట్టుకున్నది.

మాలలు ధరించిన భక్తులు



శక్తిపీఠం మాలలు ధరించిన భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ హైమావతి, గురుస్వామి జగన్

ఆకివీడు, జనవరి 18: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే శక్తిపీఠం ఆదిపరాశక్తి అని నగర పంచాయతి చైర్మన్ జామి హైమావతి అన్నారు. గురువారం వేణు గోపాల స్వామి దేవస్థానం సమీపంలో వందల మంది భక్తులకు గురుస్వామి సంబంగి జగన్-జయశ్రీ నేతృత్వంలో శక్తిపీఠం మాలలు ధరించి పూజలు చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని మద్రాసుకు 97 కిలో మీటర్ల దూరంలో మేల్‌మరుత్తూర్‌లో ఆధి పరాశక్తి పీఠం ఉందని,ఐదు రోజులు ఇక్కడ పూజలు చేసి అనంతరం వెళ్ళడం జరు గుతుందన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు నగదు జమ

భీమవరం, జనవరి 18 : ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్సుమెంటు కింద జిల్లాలో మొత్తం 16449 మంది మహిళా లబ్ధిదారులకు రూ.2 కోట్ల 49 లక్షలు జమ చేసినట్లు కలెక్టరు పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టరు ప్రశాంతి, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు విజయవాడ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌ను తిలకించారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు కలెక్టరు అందజేశారు.

షుగర్ నిర్ధారణ పరీక్షలు

తణుకు, జనవరి 18: సీనియర్ సిటీజన్స్ సంఘ కార్యాలయంలో గురువారం షుగర్ పరీక్షలు నిర్వహించారు. సాయి శ్వేత ల్యాబ్ పర్యవేక్షణలో 38 మందిని పరీక్షించినట్లు సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి చెప్పారు.



పూర్వ విద్యార్థుల కలయిక

కాళ్ళ, జనవరి 18 : పూర్వ విద్యార్థుల కలయికకు కోపల్లె హైస్కూల్ వేదికైంది. 2002-03 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఒక చోట కలిశారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తమ వయస్సును సైతం పక్కనపెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు.

సెల్‌టవర్ ఎక్కి నిరసన



భీమవరం క్రైం, జనవరి 18 : భీమవరంలోని ఓ బ్యాంక్ నుంచి రావల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ లోకం ఏసు ఆరోపించారు. ఇదే విషయాన్ని గతకొన్నేళ్ళుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. తన సమస్యను పరిష్కరించే వరకు సెల్‌టవర్‌పైనే నిరసన వ్యక్తం చేస్తానంటూ భీమవరం మండలం చినఅమిరంలోని సెల్‌టవర్‌ను గురువారం ఎక్కాడు. రాత్రి పొద్దుపోయే వరకు కిందకు దిగలేదు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు వెళ్ళి అతనితో చరవాణిలో మాట్లాడినా ఫలితం లేదు. ఐదేళ్ళ క్రితం జరిగిన రహదారి ప్రమాదంలో అతని తండ్రి సత్యనారాయణమూర్తి మృతి చెందారని, అప్పట్నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. కాగా ఇదే విషయమై గతంలో రాయలం సమీపంలో సెల్‌టవర్ ఎక్కాడు. సంబంధిత బ్యాంకు బ్రాంచి, ప్రధాన కార్యాలయాల దగ్గర ఆందోళన వ్యక్తం చేశాడు.






ఆచంట, పెనుగొండలలో ఎన్టీఆర్ విగ్రహం, చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం... పాలకొల్లులో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర.. తాడేపల్లిగూడెంలో నివాళులర్పిస్తున్న బాబ్జి

తెలుగు ప్రజల కీర్తిని చాటిన మహనీయుడు ఎన్టీఆర్

ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకుల నివాళులు

భీమవరం అర్బన్, జనవరి 18 : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామరావు వర్ధంతి కార్యక్రమం జిల్లా తెలుగుదేవం పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం భీమవరంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. భీమవరంలో టీడీపీ సీనియర్ నాయకులు మద్దల రాము నిరుపేద మహిళలకు చీరలు పంపిణీని జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు చేతలమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఇందుకరి సుబ్రహ్మణ్యం రాజు, ముఖ్యనాయకులు గనుపూడి తిరుపాల్, మైలబత్తుల ఐజాక్‌బాబు, చల్లబోయిన సుబ్బారావు పాల్గొన్నారు.

యలమంచిలి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ప్రధానకూడలి వద్ద, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకుడు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) ఆర్థిక సాయంతో సమకూర్చిన 36 సైకిళ్లను పేదలకు పంపిణీ చేశారు.

కాళ్ళ: పెదఅమిరంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే మంతెన రామరాజు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భీమవరంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, ఎన్టీయార్ అభిమానులు రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, కఠారి నరసింహరాజు, కాలువ వెంకట్రావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: స్టీమర్‌రోడ్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నసమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో బర్రె ప్రసాద్, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, గుబ్బల నాగరాజు, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తణుకు: బుద్దాల బ్లడ్ బ్యాంకులో మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ తనయుడు నిఖిల్ రత్న ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. వెంకటేశ్వర సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, బసవా రామకృష్ణ, వెంకన్నబాబు, బాస్కరరావు, రాంబాబు, రమణమ్మ పాల్గొన్నారు.

వీరవాసరం: బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. పూలమాలలు వేసి నినాదాలు చేశారు. మత్స్యపురి సెంటర్‌లో గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా కనకయ్య ఆధ్వర్యంలోనూ, నవుదూరు జంక్షన్‌లో తెలుగు యువత నాయకుడు కవురు శివకృష్ణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, మండలకమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొల్లేపర శ్రీనివాస్, యరకరాజు గోపాలకృష్ణంరాజు, రాయపల్లి వెంకట్, కడలి వాసు పాల్గొన్నారు.

ఆకివీడు: ఆకివీడు సంత ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల-పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోటు పల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, అజ్మల్ పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం, పిప్పర, ఎ.గోపవరం, వెలగపల్లి, మల్లపురాజుపేట, మొయ్యేరు, అర్ధవరం తదితర గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, పార్టీ నాయకులు యాళ్ళ సుబ్బారావు, కాపారం చిన్న, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరు, గొల్లలకోడేరు, గొరగనమూడి, మోగల్లు, కోరుకొల్లు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, దొంగ కృష్ణ, శరకన వెంకటేశ్వర్లు, కడిమి సత్యనారాయణ, మాధవరావు, జేవీ సత్యనారాయణ, ఇళ్ళ నాగబాబు పాల్గొన్నారు. గొల్లలకోడేరులో టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి సాలా మల్లేశ్వరరావు, కమ్మిలి రాంబాబు, తదితరుల ఆధ్వర్యంలో ఎన్టీయార్ వర్ధంతి నిర్వహించారు.

పోడూరు: కొమ్ముచిక్కాలలో మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జిన్నూరులో డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పండితవిల్లూరు మాజీ సర్పంచ్ కొరిపల్లి రామచంద్రరావు, గణపతినీడి రాంబాబు, బివి.సత్యనారాయణరాజు, దేవళ్ల శ్రీరామకోటి మోహన్, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో ఎన్‌టీఆర్ విగ్రహానికి జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, చిలుకూరి సీతారామ్, బుజ్జి, మనోవర్తి సుబ్బారావు, కేతా మురళి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వల్లూరులో వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, దేవళ్ళ రమేష్, ఏడిద శ్రీను, గెద్దాడ సన్యాసిరావు, ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీను నివాళులు అర్పించారు.

పెనుగొండ: పెనుగొండ టీడీపీ కార్యాలయంలో సర్పంచ్ నక్కా వేద వ్యాస శాస్త్రి గురువారం ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వడలి గ్రామంలో టీడీపీ నాయకులు పేదలకు దుప్పట్లు , పండ్లు పంపిణీ చేశారు.

తాడేపల్లిగూడెం అర్బన్: శేషమహల్ సెంటర్, 28, 15 వార్డుల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, గంధం సతీష్, నల్లమిల్లి చినగోపిరెడ్డి, షేక్ బాజీ పాల్గొన్నారు. పెంటపాడులో దాసరి సతీష్‌కుమార్, మౌంజీపాడులో పాతూరి రాంప్రసాద్‌చౌదరి, ఉమామహేశ్వరంలో కొండ్రెడ్డి హైమావతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఉండి: టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, కునుకు శ్రీను, కిన్నెర వెంకన్న, గొట్టం బాబి, ముదునూరి కృష్ణంరాజు, కాగిత మహంకాళి, కర్రి శ్రీనుజయలక్ష్మీ, త్రిమూర్తులు, పెద్దింటి బాబు పాల్గొన్నారు. పాములపర్రులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కేశన యాదగిరి, కోమటి నరేంద్రబాబు, తోట రాము, కేశన కోటి, మాజీ ఎంపిటీసీ వర్రే సముద్రమూర్తి తదితరులు ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

పాలకొల్లు టౌన్: పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రామనాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, మహమ్మద్ జానీ, ధనాని ప్రకాష్ పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, పార్టీ నాయకులు కలిదిండి కుమార్ బాబు, పాలా రాంబాబు, గోపాలం, డొల్లా రత్నంరాజు, మామాడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, కవురు నాగేశ్వరరావు, వెలిది పుల్లారావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.







గణపవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు.. నరసాపురంలో పొత్తూరి, కొవ్వలి నాయుడుల అన్నదానం.. తణుకులో రక్తదానం చేస్తున్న టీడీపీ నాయకులు.. నివాళులర్పిస్తున్న తణుకు నాయకులు

అంగన్‌వాడీల వినూత్న నిరసన



పాలకోడేరులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

తణుకు/వీరవాసరం/పాలకోడేరు/భీమవరం అర్బన్, జనవరి 18: తణుకులో అంగన్‌వాడీలు గడ్డి నోట్లో పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు, సహాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతోనూ, పాటలతోనూ నిరసనను వ్యక్తం చేశారు. పాలకోడేరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు గురువారం ధర్నా నిర్వహించారు. భీమవరంలో అంగన్వాడీలు ఖాళీ కంచాలతో వినుత్నంగా నిరసన తెలిపారు. అంగన్‌వాడీల ఆందోళనకు వామపక్ష నాయకులు మద్దతు తెలిపారు.

భూహక్కు చట్టం దుర్మార్గం

తణుకు, జనవరి 18: భూహక్కు చట్టం దుర్మార్గమని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. కోర్టు విధులను గురువారం బహిష్కరించి ఒంటి కాళ్లపై నిలబడి చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విజయకుమార్, కొండా శ్రీనివాసు, కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల శ్రీనివాసు, ఎం.ప్రతాప్‌కుమార్, కామన మనిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

గణపవరం, జనవరి 18: గ్రామాల్లో మౌలిక సదుపా యాల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. గురువారం సరిపల్లెలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గణపవరం మండల పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి విజేతలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేశారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీపీ దండు వెంకట రామరాజు, జడ్పీటీసీ దేవరపు సోమాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


వేమన పద్యాలు నీతివంతమైనవి: కారుమూరి

అత్తిలి, జనవరి 18: వేమన పద్యాలు ఎంతో నీతివంతమైనవి మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు అన్నారు. ఆరవల్లిలో 99వ యోగివేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా క్రీడాపోటీల విజేతలకు గురువారం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ఆరవల్లి గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు. దంతుపల్లి-మాముడూరు రహదారి నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీద్రనాథ్, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ షర్మిలా రెడ్డి, సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ, వెలగల అమ్మిరెడ్డి మాట్లాడారు. భరణి ప్రసాద్, ఎస్‌వీఎస్ రెడ్డి, శ్రీరామరెడ్డి, పైబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

పెన్షనర్స్ ధ్రువీకరణ పత్రాలు అందించాలి

భీమవరం టౌన్, జనవరి 18:పెన్షనర్స్‌కు జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) సమర్పణ గురించి అవగాహన కల్పించాలని భీమవరం ఎస్‌టీవో అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరం ఎస్‌టీవో కార్యాలయం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పెన్షనర్స్‌కు జీవన ధ్రువీకరణ పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వచ్చేనెల 29లోగా ఈ సర్టిఫికెట్ అందించాలని, చాలామంది అవగాహన రాహిత్యంతో ఉంటున్నారని, సదురు సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరరీ కార్యాలయంలో గానీ ఇంటర్ నెట్ ద్వారా గాని అందించాలన్నారు. అనుమానాలు ఉంటే 6302618446 నెంబరుకు సంప్రదించవచ్చునని అన్నారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.జేమ్స్ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 408 రకాల పిండి వంటలతో విందు



రాజోలు, జనవరి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన కాసు శ్రీనివాస్-భవానీ దంపతుల కుమారుడు కాసు సుకేష్‌కు గత ఏడాది సెప్టెంబరు 2న పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన చుండూరి సుబ్రహ్మణ్యం-శ్రీలక్ష్మిల కుమార్తె శ్రీరంగనాయకితో వివాహమైంది. అల్లుడు, కూతుర్ని సంక్రాంతికి సుబ్రహ్మణ్యం నర్సాపురం ఆహ్వానించి అతిథిమర్యాదలతో సత్కరించి 408రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటుచేశారు. అల్లుడి, కూతురికి అనేక కానుకలు ఇచ్చారు.

అధికారుల తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు, కౌన్సిలర్లు

ఆకివీడు, జనవరి 18: నగర పంచాయతీలో అధికారపార్టీ నేతలతో కలిసి అధికారులు స్కామ్‌లు చేస్తున్నారని ఎమ్మెల్యే మంతెన రామరాజు సమక్షంలో కమిషనర్ కృష్ణ మోహన్‌ను టీడీపీ కౌన్సిలర్లు నిలదీశారు. కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీరు కలుషితమైందని అన్నారు. పారిశుద్యం అధ్వానంగా ఉందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడా నికి వచ్చిన ఎమ్మెల్యే మంతెన రామరాజు దృష్టికి టీడీపీ నాయకులు సమస్యలు తీసుకెళ్ళారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు కూడా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులే నన్న విషయాన్ని మీరు మరవరాదని కమిషనర్ కృష్ణమోహన్‌ను నిలదీశారు. నగర పంచాయతీకి వచ్చే ఆదాయంతో ప్రతిపక్షం అనే భావన లేకుండా అన్ని వార్డులలో అభివృద్ధి చేయించాలన్నారు. ఇదే విషయం మరోసారి తన దృష్టికి వస్తే తాను ఏమి చేయాలో అదే చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ బొల్లా వీరశ్వేత, కౌన్సిలర్ బత్తుల శ్యామల, కిమిడి నాగరాజు, పార్టీ మండల, పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'కోర్టు తీర్పులను వక్రీకరించడం తగదు'

భీమవరం అర్బన్, జనవరి 18 : అత్యుత్తమ న్యాయస్థానాల న్యాయమూర్తుల తీర్పులను వక్రీకరించడం తగదని రాజ్యసభ మాజీ సభ్యురాలు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. కోర్టు తీర్పులను కొన్ని పత్రికలు, టీవీ ఛానల్స్ వక్రీకరించి దిగజారుడు వార్తను ప్రచారం చేస్తున్నాయన్నాని మండిపడ్డారు. చంద్రబాబు పై పెట్టిన స్కిల్ కేసులో నేటి వరకు 5పైసలు అవినీతి కనీస ఆధారాలను కూడా సీఐడీ నిరుపించలేక పోయరని విమర్శించారు. కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ ప్రకటనలు చేస్తున్న ఏఏజీ పొన్నవోలు వ్యాఖ్యలు దారుణం అన్నారు.

ఆలయంలో గంట తొలగింపుపై నిరసన

భీమవరంటౌన్, జనవరి 18 : మావుళ్ళమ్మ ఆలయంలో గంట తొలగింపుపై పట్టణానికి చెందిన హిందూ సంఘ నాయకులు దేవస్థానం అధికారులను ప్రశ్నించారు. కొంత మంది భక్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని వారు వివరించారు. గురువారం సాయంత్రం కొంత హిందూ సంఘ నాయకులు ఆలయానికిచేరుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు గంటను తిరిగి ఏర్పాటు చేశారు.

జగన్నాథపురంలో ఎన్టీఆర్‌కు నివాళులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 18: మండలంలోని జగన్నాథపురంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవాబుపాలెంలో సర్పంచ్ మద్దుకూరి ధనరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి, పెదతాడేపల్లిలో సర్పంచ్ పోతుల అన్నవరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పరిమి వీరభద్రరావు, అబ్బిన నాగమణి, చినతాడేపల్లిలో పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా నడవాలి

భీమవరం రూరల్, జనవరి 18 : అంబేడ్కర్ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలని డీఎన్నార్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు అన్నారు. గురువారం నాడు కళాశాలలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.బి శాంతకుమారి మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణను గుర్తు చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

భీమవరం రూరల్, జనవరి 18 : సంజీవయ్య నగర్ కెనాల్ రోడ్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పైప్‌లైనును వంద పడకల ఏరియా ఆసుపత్రి వరకు పొడిగించడం జరిగిందన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలను అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన రూ.36 కోట్లు నిధులను మంజూరు చేయించడంతో పాటుగా టెండర్ ప్రక్రియ కూడా జరుగుతుందన్నారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మేడిది జాన్సన్, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కామన నాగేశ్వరరావు, పిప్పళ్ళ నాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, జనవరి 18 : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. భీమవరంలో గురువారం జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె వేతనాలు పెంచడం ద్వారానే పరిష్కారం అవుతుందన్నారు. ఏఐటీయుసీ జిల్లా నాయకులు చల్లబోయిన రంగారావు మట్లాడుతూ పలు దఫాలు గా ప్రభుత్వం చర్చలకు పిలిచి అన్ని హామీలు నెరవేరుస్తున్నాము అని ప్రభుత్వం చెప్పడమే తప్ప తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామన్న హామీకి సమాదనాం చెప్పడం లేదన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్షులు జెఎన్వీ గోపాలన్, సీఐటీయు నాయకులు వాసుదేవరావు, ఎం. ఆంజనేయుల పాల్గొన్నారు.

గంటా సుందరకుమార్‌కు సన్మానం

భీమవరం అర్బన్, జనవరి 18: దళిత నాయకుడు గంటా సుందర్‌కుమార్‌కు ఇటీవల పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియామకం కావడం పట్ల గురువారం లా చాంబర్‌లో న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన సభలో సీపీఐ జిల్లా నాయకులు చల్లబోయిన రంగారావు, బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ఆచంట, జనవరి 18: విజయవాడలో సీఎం జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ప్రారంభం సందర్భంగా జిల్లా, నియోజకవర్గం నుంచి ప్రతీ ఒక్కరూ తరలి రావాలని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. గురువారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వాసురెడ్డి, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

నరసాపురం టౌన్, జనవరి 18: ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా గురువారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని హోటళ్ళు, షాపులు, బిగ్ బజార్లు సందర్శించి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై వ్యాపారస్థులకు అవగాహన కల్పించారు. 14ఏళ్లలోపు చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు చల్లా దానయ్యనాయుడు, శ్రీహరి, శ్రీనివాసరావు, ఆనందబాబు, పద్మజ, వై. సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్లు ప్రశాంతంగా ఉండాలి

తణుకు, జనవరి 18: ప్రమాదాలు జరకుండా ఉండాలంటే డ్రైవర్లు మానసిన ప్రశాంతత కలిగి ఉండాలని నరసాపురం వై.ఎన్. కాలేజి హెచ్‌ఆర్‌డీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాసు అన్నారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తణుకు డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రమణమూర్తి, శ్రీనివాసు, పున్నయ్య పాల్గొన్నారు.